నేటి నుంచి శరన్న నవరాత్రోత్సవాలు

- మండపాల్లో కొలువుదీరనున్న అమ్మవారు
- తిరుచానూరులో 10 రోజులపాటు కల్యాణోత్సవం సేవ రద్దు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తేతెలంగాణ): నేటి నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలు, మండపాలు ముస్తాబయ్యాయి. భక్తులు తొమ్మిది రోజులపాటు తీరొక్క అవతారంలో దర్శనమిచ్చే అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించనున్నారు. తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో నేటి నుంచి 12వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ మధ్యాహ్నం 3గంటలకు శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తామని టీటీడీ అధికారులు వెల్లడించారు. 12న విజయదశమిని పురస్కరించుకొని రాత్రి 7:45 గంటలకు పద్మావతి అమ్మవారు గజ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. కాగా, నవరాత్రి ఉత్సవాల కారణంగా 10 రోజుల పాటు కల్యాణోత్సవం సేవను రద్దు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. 4, 11వ తేదీల్లో లక్ష్మీపూజ, 12న ఊంజల సేవలను రద్దు చేసినట్టు వివరించారు.

రాష్ట్రంలో రౌడీల పాలన!

- పట్టపగటే కేటీఆర్ హత్యకు కుట్ర
- సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలో పోలీసులు పావులు
- నిందితులను ఎందుకు అరెస్టు చేయలే?
- సీఎం ధనదాహానికి హైడ్రా ఆయుధం
- మంత్రి కొండా సురేఖ వెంటనే క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పక్కన రాకేశ్‌రెడ్డి, పల్లె రవికుమార్

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రౌడీల పాలన, గూండాల పాలన, రాక్షస పాలన సాగుతున్నదని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పట్టపగలే నట్టనడి నగరంలో ప్రధాన ప్రతిపక్ష నేత కేటీఆర్‌పై హత్యకు కుట్ర పన్నారని విమర్శించారు. ప్రపంచ బ్యాంకుతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కై మూసీ సుందరీకరణ పేరుతో రూ.లక్షా 50 వేల కోట్ల అవినీతికి తెరలేపారని, ఆ కుట్రను బీఆర్ఎస్ అడ్డుకున్నది కాబట్టే కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేశారని మండిపడ్డారు. హైదరాబాద్ నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతె రోహిత్ ఆధ్వర్యంలో కేటీఆర్ కాన్వాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. రేవంత్‌రెడ్డి ధన దాహానికి హైడ్రా ఆయుధంలా మారిందని, ఆయన బండారం త్వరలో బట్టబయలు అవుతుందని పేర్కొన్నారు. రేవంత్ రహస్య ఒప్పందాలను త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. శ్రీలంకలో రాజపక్సే సోదరులపై ప్రజలు తిరుగుబాటు చేసినట్టు తెలంగాణలో రేవంత్‌రెడ్డిపై తిరుగుబాటు తప్పదని అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పట్టపగలు కేటీఆర్ కాన్వాయ్‌పై దాడికి పాల్పడితే పోలీసులు ఎందుకు అడ్డుకోలేకపోయారని, పోలీస్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎటుపోయిందని నిలదీశారు. దాడి ఘటన వ్యవహారంలో పోలీసుల వైఖరి అనుమానాస్పదంగా ఉన్నదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కుట్రకు పోలీసులు పావులు అవుతున్నారని చెప్పారు. దాడి జరిగి 26 గంటలైనా నిందితులను పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. తానే కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్నట్టు ట్వీట్ చేసినా రోహిత్‌ను ఎందుకు అదుపులోకి తీసుకోలేదని ప్రశ్నించారు. పోలీసులు కాంగ్రెస్‌కు కొమ్ము కాస్తున్నారా? అని నిలదీశారు.

బీఆర్ఎస్ నేతలపై వరుస దాడులు

కాంగ్రెస్ రాక్షస పాలనతో ప్రతిపక్ష నేతల ఇండ్లు, కార్యాలయాలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తాము ఏనాడూ ఇలా దాడులకు పాల్పడలేదని ప్రవీణ్‌కుమార్ గుర్తుచేశారు. తాజాగా తెలంగాణభవన్ వద్దకు కాంగ్రెస్ నేతలు వచ్చి దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా, అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలపైనే పోలీసులు కేసులు పెట్టారని మండిపడ్డారు. తమ పార్టీ ఆఫీసుపై దాడికి వచ్చిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని, పోలీసులు ఈ వివక్ష ఎందుకు చూపుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు ఏనాడూ ఇతర పార్టీల కార్యాలయాల్లోకి వెళ్లలేదని గుర్తుచేశారు. కానీ, సిద్దిపేటలో హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై, పాడి కౌశిక్‌రెడ్డిపై ఇంటిపై కాంగ్రెస్ నేతలు దాడి చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ చేస్తున్న రూ.1.50 లక్షల కోట్ల అవినీతిని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నందునే దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి ప్రపంచ బ్యాంకు వైపు ఉంటే.. బీఆర్ఎస్ పీడిత ప్రజల పక్షాన ఉన్నదని చెప్పారు. కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలపై ఎన్ని దాడులు చేసినా ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూనే ఉంటామని స్పష్టంచేశారు. ప్రపంచ బ్యాంకు ఏజెంట్లు ఎన్ని దాడులు చేసినా ఎదుర్కొంటామని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సంయమనంతో వ్యవహరిస్తున్నారని, ఓపికకూ ఒక హద్దు ఉంటుందని పేర్కొన్నారు.

రేవంత్‌వి అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్

రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నట్టు ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. హైడ్రాపై ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నందున కొండా సురేఖతో అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆమె వ్యాఖ్యలు కాంగ్రెస్ నీచ సంస్కృతికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సురేఖ తన వ్యాఖ్యలపై మహిళాలోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూచించారు. సురేఖకు మంత్రివర్గంలో ఉండే అర్హత లేదని, ఆమె వ్యాఖ్యలపై లీగల్‌గా ముందుకు వెళ్తామని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె రవీందర్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, తుంగ బాలు, నరేందర్, రాజు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జా తల్లి విజయభారతి అనారోగ్యంతో ఇటీవల మరణించగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ నాయకులు ఉన్నారు.

గౌతమ్ అదానీతో పొంగులేటి భేటీ

మొదటిపేజీ తరువాయి...

భేటీనా? ప్రభుత్వం తరపున జరిగిన భేటీనా? అన్నదానిపై స్పష్టత లేదు. వీరిద్దరితోపాటు కాంగ్రెస్ పార్టీకి సోషల్ మీడియా కన్సల్టెంట్‌గా ఉన్న సునీల్ కొనుగోలు కూడా ఉన్నారని విశ్వసనీయంగా తెలిసింది. సుమారు గంటకుపైగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గౌతమ్ అదానీ మధ్య సమావేశం జరిగినట్టు చెప్తున్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో సమావేశం అనంతరం అదానీ తిరిగి వెళ్లినట్టు తెలిసింది. అయితే, భేటీపై రాష్ట్రప్రభుత్వం, మంత్రి పొంగులేటి, అదానీ గ్రూప్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. ఒకవైపు జాతీయస్థాయిలో అదానీపై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేస్తుండగా, సీఎం రేవంత్ దావోస్‌లో అదానీలో ఒప్పందాలు చేసుకోవటం, నంబర్ 2గా చెప్పుకుంటున్న పొంగులేటి.. ఆయనతో రహస్య భేటీ కావటం రాజకీయంగా పెద్ద చర్చ జరుగుతున్నది. రాష్ట్రంలో దోస్తీ.. దేశవ్యాప్తంగా కుస్తీ ఏమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదానీతో ఎందుకు అంటకాగుతున్నారని కాంగ్రెస్ పార్టీలోనూ పలువురు సీనియర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఎందుకు కలిశారు..?

అదానీ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోబోతున్నట్టు గతంలో ప్రభుత్వం ప్రకటించింది. కానీ, విమర్శలు రావడంతో ఒప్పంద వివరాలు మాత్రం వెల్లడించలేదు. అయితే, నగర శివారులో అతి పెద్ద భూమికి సంబంధించిన అంశంపై వీరి భేటీ జరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన ఓ కంపెనీని అదానీ సంస్థ తిరిగి కొనుగోలు చేస్తున్నదని.. ఆ కంపెనీ కొనుగోలు విషయంలో ఇద్దరు కలిశారని చెప్తున్నారు. అదానీతో తన కంపెనీకి సంబంధించిన డీల్ ఫైనల్ చేసుకోవడానికే పొంగులేటి కలిశారని, దానికోసం రాష్ట్రంలోని పలు కీలకమైన ప్రాజెక్టులు అదానీ గ్రూపునకు ఇచ్చే అంశంపైనా చర్చ జరిగినట్టు చెప్తున్నారు. సింగరేణి బొగ్గు గనులు, విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్తు ప్రాజెక్టులు తదితర వాటికి సంబంధించి కీలక చర్చలు జరిగినట్టు తెలిసింది. ప్రభుత్వం కూడా ఒక భారీ ప్రాజెక్టును అదానీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నట్టు చెప్తున్నారు.

రాయదుర్గంలోని 84 ఎకరాలను కట్టబెట్టేందుకేనా?: కేటీఆర్

ఐటీసీ కోహినూర్‌లోని ప్రెసిడెన్షియల్ సూట్‌లో తెలంగాణ క్యాబినెట్‌లోని నంబర్-2తో అదానీ ఎందుకు సమావేశమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఇదే సమావేశంలో సునీల్ కనుగోలు కూడా ఉన్నారని, ఆయన ఏం చేస్తున్నారని అడిగారు. అదానీతో కాంగ్రెస్ దోస్తీ కట్టిందా? లేదంటే రాయదుర్గంలోని 84 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని అదానీకి కట్టబెట్టే కుట్ర చేస్తున్నారా? అని నిలదీశారు.

9 నెలల్లో 842 కేసులు

దూకుడు పెంచిన ఎక్సైజ్‌శాఖ

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దూకుడు పెంచింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అక్రమ మద్యం రవాణా, గంజాయి మూలాలను తుదముట్టించడంలో పైచేయి సాధించింది. తొమ్మిది నెలల కాలంలో 842 కేసులు నమోదుచేసింది. 1,445 మందిని అరెస్టుచేసింది. 364 వాహనాలను సీజ్‌చేసింది. ప్రత్యేకంగా సెప్టెంబర్ మాసంలోనే 43 కేసులు నమోదుకాగా, 134 మందిని అరెస్టుచేయడమే కాకుండా 715 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనితీరుపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి బుధవారం సమీక్షించారు. మాదకద్రవ్యాల కట్టడికి కృషిచేసిన అధికారులను అభినందించారు.

9నెలల్లో పట్టుకున్నవి..

మాదక ద్రవ్యాలు	కేజీలు, గ్రాములు
గంజాయి	5214 కిలోలు
హషిష్ ఆయిల్	7.35కిలోలు
గంజాయి ఆయిల్	1.1కిలోలు
గంజాయి చాక్లెట్స్	72.66 కిలోలు
ఆల్ప్రోజోలం	16.65 కిలోలు
ఆల్ప్రోజోలం టాబ్లెట్స్	10.67 కిలోలు
డైజోఫాం	1.52 కిలోలు

పోలీస్‌స్టేషన్లలో దొంగలుపడ్డారు?

- ఠాణాల నుంచి బ్యాటరీ సైకిళ్లు మాయం!
- చోరీ అయ్యాయా..? చేతి వాటమా?
- ఆరా తీస్తున్న అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): సైకిల్ పెట్రోలింగ్ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీస్‌స్టేషన్లకు అప్పగించిన బ్యాటరీ సైకిళ్లు, హెల్మెట్లు కనిపించడం లేదు. ఆ సైకిళ్లు ఎక్కడున్నాయి? దొంగలు అపహరించారా? సిబ్బంది చేతివాటం ప్రదర్శించారా? అనేది ప్రస్తుతం సిటీ పోలీసుల్లో చర్చనీయాంశంగా మారింది. పెట్రోలింగ్ వ్యవస్థ పటిష్టతకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 130కిపైగా సైకిళ్లు వివిధ పోలీస్‌స్టేషన్లకు పంపిణీ చేశారు. ఒక్కో సైకిల్‌కు హెల్మెట్, ఫస్ట్ ఎయిడ్ కిట్, మ్యాన్‌ఫ్యాక్, లాఠీ, సైరన్, ఎల్ఈడీ లైట్, వాటర్ బాటిళ్లతో కూడిన కిట్‌ను కూడా అందజేశారు. కార్లు వెళ్లని ప్రాంతాల్లో సిబ్బంది బైకులు, సైకిళ్ల మీదుగా వెళ్లి బస్తీ, గల్లీలో పెట్రోలింగ్ నిర్వహించారు. సౌత్‌జోన్‌లోని ఠాణాలకు 13, సెంట్రల్ 24, వెస్ట్‌జోన్ 20, ట్రాఫిక్ ఠాణాలకు 50, ఎస్బీకి 19, సీపీ కార్యాలయానికి 9 సైకిళ్లను అందజేశారు. ఆ తర్వాత చైనా నుంచి కూడా సైకిళ్లను తెచ్చి సిబ్బందికి ఇవ్వగా, కొన్ని పాడైపోయాయి. ప్రభుత్వం మారింది, అధికారులు మారుతూ వచ్చారు. ఆ క్రమంలోనే చాలా సైకిళ్లు ఠాణాల నుంచి మాయమవుతూ వచ్చాయి. సైకిళ్లు పనిచేయకపోతే సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు ఫోర్స్(కార్) హెడ్ క్వార్టర్స్‌కు తరలిస్తుంటారు. తుక్కుగా అమ్మేశారా? అనే విషయం కూడా లెక్కల్లో లేదని సమాచారం.

సైకిళ్ల మాయంపై ఆరా...!

సైకిళ్లు మాయమవుతున్నాయనే విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఎన్ని సైకిళ్లు పీఎస్‌లో ఉన్నాయి? అవి ఎక్కడికి పోయాయి? అనే విషయాన్ని తెలుసుకుంటున్నారు. కార్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షిత మూర్తిని వివరణ కోరగా సైకిళ్లు ఎక్కడెక్కడున్నాయనే విషయంపై ఆరా తీస్తున్నామని తెలిపారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 2: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అల్లాపూర్ గ్రామంలో ఓ చిన్నారిపై వీధి కుక్కలు దాడిచేశాయి. గ్రామానికి చెందిన విఠల్‌రావు కూతురు వాణిశ్రీ బుధవారం ఆరుబయట ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో చిన్నారి ముఖం, తలపై గాయాలయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. కుక్కల బెడద తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

ప్రతిరోజూ సంబురాలు : తాతా మధు

ఖమ్మం, అక్టోబర్ 2: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలను ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో ఈ నెల 10 వరకూ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ల అధ్యక్షులు, ఉద్యమకారులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ప్రజలు కూడా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం

- ఏదులాపురం మున్సిపాలిటీపై భిన్నాభిప్రాయాలు
- పెద్దతండా పేరుతోనే ఏర్పాటు చేయాలని మరో వాదన
- వ్యతిరేకత వచ్చిన గ్రామాల్లో మరోమారు సభలు



మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్, ఏఎంసీ చైర్మన్

ఖమ్మం రూరల్, అక్టోబర్ 2: ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటుపై బుధవారం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపీడీవో ఎస్ కుమార్, ఎంపీవో రాజారావు ఆధ్వర్యంలో గ్రామసభలు జరిగాయి. భవిష్యత్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఏఏ కార్యక్రమాలు చేపట్టాలి అనే అంశాలపై ప్రజల నుంచి అధికారులు అభిప్రాయాలు సేకరించారు. ఇటీవల ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తూ రూపొందించిన నివేదికను రాష్ట్ర సర్కార్‌కు కలెక్టర్ పంపిన సంగత తెలిసిందే. అయితే గ్రామసభల్లో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాట అంశాన్ని సైతం జోడించారు. దాదాపు అన్ని పంచాయతీల్లో వ్యవసాయ రంగం నేపథ్యం, వ్యవసాయ కూలీల నేపథ్యం కలిగిన వారు మున్సిపాలిటీ ఏర్పాటుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల నగరం నుంచి విలీన పంచాయతీల్లో ఇండ్లు నిర్మాణం చేసుకున్న ఉద్యోగులు, రిటైర్లు ఉద్యోగులు, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన మున్సిపాలిటీ ఏర్పాటును స్వాగతించారు. పెద్దతండా పంచాయతీలో జరిగిన సభలో నూతన మున్సిపాలిటీ ప్రస్తుతం మండల కేంద్రంగా ఉన్న పెద్దతండా పేరుతోనే ఏర్పాటు చేయాలని కోరారు. బారుగూడెం, ఏదులాపురం, మద్దులపల్లి గ్రామాల్లో జరిగిన సభలలో మెజార్టీ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో తమ గ్రామాలను మున్సిపాలిటీలో కలపవద్దని ముక్తకంఠంగా తేల్చి చెప్పారు. తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన గ్రామాల్లో మరోమారు గ్రామసభలు ఏర్పాటు చేసే యోచనలో అధికారులు ఉన్నారు. రానున్న ఒకటి రెండు రోజుల్లో సదరు గ్రామాలను గుర్తించి ప్రత్యేకంగా గ్రామసభలు ఏర్పాటు చేసి తీర్మాణాలను చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మత్తు పదార్థాలు, పోక్సో కేసుల్లో శిక్షలు తీవ్రతరం

- ఖైదీల సమస్యలకు న్యాయ సేవాధికార సంస్థతో పరిష్కారం
- ఖమ్మం జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జీ రాజగోపాల్



మాట్లాడుతున్న జైలర్ శ్రీధర్

ఖమ్మం రూరల్, అక్టోబర్ 2: మత్తు పదర్థాలు, పోక్సో కేసుల్లో శిక్షలు తీవ్రంగా ఉంటాయని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, సెషన్స్ జడి జీ రాజగోపాల్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లా జైల్లో జైలర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి జీ రాజగోపాల్, కేవీ చంద్రశేఖర్, లీగల్ సెల్ సర్వీసెస్ అథారటి సెక్రటరీ కేవీ చంద్రశేఖర్ హాజరయ్యారు. తొలుత జైల్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి, ఏర్పాటు చేసిన చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళి అర్పించారు. జిల్లా జడ్జి జీ రాజగోపాల్ మాట్లాడుతూ.. కఠినమైన మత్తుపదర్థాలు, పోక్సో కేసుల్లో తీవ్ర శిక్షలు ఉంటాయన్నారు. ఖైదీల సమస్యలను న్యాయ సేవాసంస్థ ద్వార పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన ఖైదీలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జైలర్లు సక్రునాయక్, లక్ష్మీనారాయణ, సుభాష్, హనుమంతరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- గందరగోళంగా మారుతున్న 'డీఎస్సీ-2024' ప్రక్రియ
- అభ్యర్థులకు మెసేజీలు వస్తున్నా జాబితాలో పేర్లు ఉండట్లేదు..
- 'ఎస్‌జీటీ'ల సర్టిఫికెట్ల పరిశీలనకు 321 మంది హాజరు
- పరిశీలించిన ఏడీ శ్రీనివాసచారి, డీఈవో సోమశేఖరశర్మ
- ఖమ్మంలో ఆందోళనలో 'డీఎస్సీ ప్రత్యేక విద్య' అభ్యర్థులు

'ఢీ' ఎస్సీ

రఘునాథపాలెం మండలం రాములు తండాకు చెందిన గుగులోతు సరిత డీఎస్సీ 1:3 నిష్పత్తిలో ఎంపికైంది. సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలంటూ ఆమెకు మెసేజ్ వచ్చింది. దాని ఆధారంగా ఆమె సదరు పరిశీలన కేంద్రానికి వెళ్లింది. తీరా జాబితాలో ఆమె పేరు లేదని అక్కడి అధికారులు సదరు అభ్యర్థినికి చెప్పారు. దీంతో ఆమె నివ్వెరపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేచి ఉన్నప్పటికీ అధికారులు ఆమెకు ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదు. దీంతో బిక్కుబిక్కుమంటూ ఇంటి దారి పట్టింది. ఇలా సుమారు 20కిపైగా అభ్యర్థులకు మెసేజ్‌లు వచ్చినప్పటికీ జాబితాలో పేర్లు లేకపోవడం వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 2: విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్ణయాలు, అర్థంలేని విధానాల కారణంగా డీఎస్సీ-2024 నియామక ప్రక్రియ గందరగోళంగా మారుతోంది. సోమవారం డీఎస్సీ ఫలితాలు ప్రకటించినప్పటికీ మంగళవారం అర్ధరాత్రి వరకు ఎస్‌జీటీల జాబితా విడుదలవుతుందా? లేదా? అనే ఆందోళన నెలకొంది. బుధవారం రాత్రి వరకు స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన 1:3 జాబితా ఖరారుకాని పరిస్థితి. ఎస్‌జీటీల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు హాజరుకావాలంటూ కొందరికి మెసేజీలు వచ్చాయి. కానీ జాబితాలో పేర్లు ఉండడం లేదు. ఈ అంశం అభ్యర్థులను గందరగోళంలోకి నెడుతోంది. కొందరు అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అధికారులను కలిసి సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తప్పిదాలపై ఈసారి 'ఢీ'ఎస్సీనే అంటున్నారు.

జాబితాలో పేరు ఉంటేనే పరిశీలన..

డీఎస్సీ-2024 సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఖమ్మంలోని రోటరీనగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) అభ్యర్థులు హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థుల సెల్‌ఫోన్లకు మెసెజ్‌లు వస్తాయని ప్రభుత్వమే ప్రకటించింది. దీంతో మెసేజీలు వచ్చిన అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు వస్తే.. 'జాబితాలో మీ పేరు లేదు. మీరు అర్హులు కాదు.' అంటూ అధికారులు చెబుతున్నారు. తల్లాడ, వేంసూరు మండలాలకు చెందిన ఇద్దరు అభ్యర్థులతోపాటు మరికొంతమంది అభ్యర్థులు పరిశీలన కేంద్రానికి రాగా.. జాబితాలో వారి పేర్లు లేవంటూ విద్యాశాఖాధికారులు చెప్పారు. 'మెసేజీలు వస్తే అర్హులన్నట్లేకదా?' అని అభ్యర్థులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. వీరితో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూడా కలిసి అడిషనల్ డైరెక్టర్, జిల్లా అబ్జర్వర్ శ్రీనివాసచారిని ప్రశ్నించారు. ఇష్టానుసారం ప్రక్రియ నిర్వహించొద్దని, అర్హులైన వారికి న్యాయం చేయాలని విన్నవించారు. జాబితాలో పేరు ఉంటేనే ఫైనల్ అని అధికారులు స్పష్టం చేశారు.

321 మంది హాజరు..

ఎస్‌జీటీ అభ్యర్థుల్లో 321 మంది బుధవారం నాటి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. వీరిలో 317 మంది ఎస్‌జీటీ తెలుగు మీడియం కాగా మరో నలుగురు ఎస్‌జీటీ ఉర్దూ మీడియం వారు. 1:3 జాబితాను విద్యాశాఖాధికారులు పాఠశాలలో ప్రదర్శించారు. అభ్యర్థులు జాబితాను చూసుకొని నంబర్లు వారీగా సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఏర్పాటుచేసిన కౌంటర్లలో హాజరయ్యారు. ధ్రువపత్రాల పరిశీలనకు 12 టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్‌లో ఇద్దరు గెజిటెడ్ హెచ్ఎంలు, ఒక జూనియర్ అసిస్టెంట్ ఉన్నారు. ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదులన్నింటినీ వినియోగించారు. సూపరింటెండెంట్ శ్రీధర్ ఈ ప్రక్రియను సమన్వయం చేశారు.

సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి, డీఈఓ సోమశేఖరశర్మ


సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న ప్రక్రియను పరిశీలిస్తున్న సూపరిండెంట్ శ్రీధర్

సందర్శించిన ఏడీ శ్రీనివాసాచారి..

సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను జిల్లా అబ్జర్వర్‌గా నియమితులైన విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ (ఏడీ)శ్రీనివాసాచారి పరిశీలించారు. ఉదయం భద్రాద్రి జిల్లాలో ప్రక్రియను పరిశీలించి.. మధ్యాహ్నానికి ఖమ్మం చేరుకున్నారు. ప్రతీ కౌంటర్ వద్ద ఉన్న అభ్యర్థులతోపాటు పరిశీలన చేస్తున్న ప్రధానోపాధ్యాయులతో చర్చించి పరిస్థితి గురించి తెలుసుకున్నారు. విద్యాశాఖ కమిషనర్ నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఖమ్మం నుంచి ఏడీ శ్రీనివాసాచారి, డీఈవో సోమశేఖరశర్మ పాల్గొన్నారు. స్కూల్ అసిస్టెంట్ల జాబితా, స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన జాబితా సహా పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

ఆందోళనలో స్పెషల్ డీఎస్సీ అభ్యర్థులు..

దివ్యాంగుల విద్యా బోధనకు ప్రకటించిన డీఎస్సీలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ విభాగాల్లో సరాసరి 900 పోస్టులకు పైగా రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష నిర్వహించి మెరిట్ లిస్టు ఆధారంగా ఫలితాలు విడుదల చేశారు. 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు..' అన్నట్లుగా ఉంది ప్రత్యేక విద్య ఉద్యోగార్థుల పరిస్థితి. తెలంగాణ విద్యాశాఖ అధికారులు ప్రత్యేక విద్య విభాగంలోని ఉద్యోగాలకు సంబంధించిన ఉద్యోగార్థుల ధ్రువపత్రాల పరిశీలన అంశం మర్చిపోయినట్లు వ్యవహరించడం గమనార్హం. ధ్రువపత్రాల పరిశీలన మొదలై రెండు రోజులు దాటింది. మూడో రోజు కూడా ఆ అభ్యర్థుల ఫోన్లగానీ, మెయిళ్లకుగానీ సంక్షిప్త సందేశాలు రాలేదు. దీంతో వారు వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఇంకా రెండు రోజులే మిగిలి ఉండడంతో ఆ ఉద్యోగార్థులు డీఈవో కార్యాలయాలకు, ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాలకు వెళ్లి ఆరా తీస్తున్నారు. ఈ విషయమై ఆయా జిల్లాల డీఈవోలు సైతం తమకు సమాచారం లేదని జవాబిస్తుండడం గమనార్హం. తెలంగాణ విద్యాశాఖ వైఖరితో ప్రత్యేక విద్య ఉద్యోగార్థులు భయాందోళనలో ఉన్నారు. చివరి రెండు రోజుల్లోనైనా ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందోలేదో నని ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో భారీ వర్షం


ఖమ్మంలో కురుస్తున్న వర్షం

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 2: జిల్లా వ్యాప్తంగా బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గరిష్ట ఉష్ణోగ్రత, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రానికి వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమైంది. ఆ వెంటనే ఉరుములు, మెరుపులతో జోరు వాన మొదలైంది. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అనేకచోట్ల చెట్లు, కొన్నిచోట్ల విద్యుత్ స్థంభాలు కూలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బతుకమ్మ పండుగ తొలి రోజు కావడంతో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

తిరుమలాయపాలెంలో భారీ వర్షం

తిరుమలాయపాలెం, అక్టోబర్ 2: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. రాత్రి 5.30 నుంచి 6 గంటల వరకు వర్షం కురిసింది. భారీ వర్షానికి పంట పొలాల్లో నీరు నిలిచింది. కురిసిన వర్షం పత్తి మిర్చి తోటలకు మేలు చేసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీఎం బంజరలో చోరీ

పెనుబల్లి, అక్టోబర్ 2: మండల పరిధిలోని వీ.ఎం.బంజరలో ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోపాలకృష్ణారెడ్డి గత నెల 30న కుటుంబసభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. బుధవారం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న 11 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.25 లక్షల నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.